## ఫ్లైఓవర్ రెయిలింగ్ గోడను ఢీకొట్టిన బైక్

### ఫ్లైఓవర్ పైనుంచి కిందపడడంతో యువతి దుర్మరణం



స్వీటిపాండే మృతదేహం, (ఇన్‌సెట్‌లో) ప్రమాదంలో మృతిచెందిన స్వీటి పాండే (ఫైల్‌ఫోటో)

గచ్చిబౌలి, ఆగస్టు 18 ప్రభాతవార్త : అతివేగం యువతి ప్రాణాలను బలితీసుకుంది. మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి మాదాపూర్‌లో ఫ్లైఓవర్ రెయిలింగ్ గోడను ఢీకొట్టగా, ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న యువతి ఫ్లైఓవర్ మీద నుంచి కిందపడి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమ బెంగాళ్ రాష్ట్రానికి చెందిన స్వీటి పాండే(22) ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చి సికింద్రాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్ ప్రాంతంలో నివాసం ఉంటూ అదే ప్రాంతంలో ఉన్న మారియట్ హోటల్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తుంది. కాగా పశ్చిమబెంగాళ్ ప్రాంతం నుంచే వచ్చి మారియట్ హోటల్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న రాయన్ ల్యూకేతో స్వీటి పాండేకు స్నేహం ఉంది. వీరు ఇరువురు గురువారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో స్కూటి (టిఎస్09 ఇబి0811) మీద టిఫిన్ తినేందుకు జెఎన్‌టియు వైపు నుంచి ఐకియా వైపు బయలుదేరారు. రాయన్ ల్యూకే ద్విచక్రవాహనం నడుపుతుండగా, స్వీటి పాండే వెనుక కూర్చుంది. కాగా మార్గమధ్యలో హైటెక్‌సిటీ ఫ్లైఓవర్ మీద అతివేగంతో వాహనం నడిపిన రాయల్ ల్యూకే బ్యాలెన్స్ కోల్పోయాడు. దీంతో ద్విచక్రవాహనం ఫ్లైఓవర్ రక్షణ గోడ రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో వాహనం మీద నుంచి రాయన్ ల్యూకే కిందపడిపోగా, వెనుక కూర్చున్న స్వీటీ పాండే గాలిలో ఎగిరి ఫ్లైఓవర్ మీద నుంచి కింద ఉన్న రహదారిపై పడిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన స్వీటి పాండేను స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. రాయన్ ల్యూకేకు సైతం గాయాలు కావడంతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు స్వీటి పాండే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## అసిస్టెంట్ వార్డెన్ బలవన్మరణం

### కొన్నిరోజుల క్రితమే క్యాన్సర్‌తో తల్లి మృతి



ఆత్మహత్య చేసుకున్న భవాని(ఫైల్‌ఫోటో)

గచ్చిబౌలి, ఆగస్టు 18 ప్రభాతవార్త : మాదాపూర్‌లోని ఓ ప్రైవేటు కళాశాల హాస్టల్‌లో అసిస్టెంట్ వార్డెన్‌గా పనిచేస్తున్న యువతి ఆత్మహత్య చేసుకుంది. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లికి చెందిన నర్సింహయ్య కుమార్తె చక్క భవాని(21) మాదాపూర్‌లోని ఓ ప్రైవేటు మహిళా ఇంటర్మీడియట్ కళాశాల హాస్టల్‌లో అసిస్టెంట్ వార్డెన్‌గా పనిచేస్తుంది. గతనెల జూలై 11వ తేదీన అసిస్టెంట్ వార్డెన్‌గా ఉద్యోగంలో చేరిన భవాని కళాశాల భవనం పై అంతస్థులో ఉన్న హాస్టల్‌లోనే నివాసం ఉంటుంది. ఒవైపు ఉద్యోగం చేస్తూనే ఓపెన్ డిగ్రీ చదువుతున్న భవాని తల్లి అనిత గతకొన్ని రోజుల క్రితమే క్యాన్సర్‌తో మృతిచెందింది. కాగా శుక్రవారం ఉదయం భవాని తాను పనిచేస్తున్న హాస్టల్ వద్దకు రాకపోవడంతో హాస్టల్ ఇంచార్జ్ ఫోన్ చేశాడు. భవాని ఫోన్ ఎత్తకపోవడంతో తాను నివాసం ఉంటున్న హాస్టల్ గదికి వెళ్లి చూడగా, గదిలో ఉన్న ఫ్యాన్ హుక్కుకు చున్నీతో ఉరివేసుకొని భవాని ఆత్మహత్య చేసుకొని కనిపించింది. దీంతో హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు భవాని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. భవాని ఆత్మహత్య విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కళాశాలకు చేరుకొని ఆందోళనకు దిగారు. కళాశాల వేధింపుల కారణంగానే భవాని ఆత్మహత్య చేసుకుందని వాపోయారు.



హైదరాబాద్ వార్త

# మణికొండలో రూ.కోటి నాలా స్థలం కబ్జా

**కబ్జాను తొలగించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు ● క్రిమినల్ కేసులు పెడ్తాం : ఆర్.ఐ ఉదయ్**

నార్సింగి, ఆగస్టు 18 ప్రభాతవార్త : గండిపేట మండల పరిధిలోని మణికొండలో రూ.కోటి విలువ చేసే బుల్కాపూర్ నాలాను కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారు. 200గజాల స్థలంను కబ్జా చేసి మూడు గదులు నిర్మించి, ఇతరులకు అమ్ముకుంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ స్థలంను కబ్జాదారుల నుంచి విడిపించాలని భరత్ కుమార్ అనే వ్యక్తి గండిపేట మండల తహసీల్దార్‌కు లికిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వర్షాకాలంలో వరద నీరు సులువుగా దిగువ ప్రాంతాలకు వెళ్లేందుకు వంద ఏళ్ల క్రితం అప్పటి నిజాం నవాబులు బుల్కాపూర్ నాలాను తీయించారు. పెరిగిన భూముల ధరలను సొమ్ము చేసుకునేందుకు కొందరు రాజకీయ నాయకుల అండతో కబ్జాదారులు ఏటేటా కబ్జా చేసుకుంటూ వస్తున్నారు. దీని ఫలితంగానే 20.అడుగుల వెడల్పు ఉన్న ఈ బుల్కాపూర్ నాలా ఇప్పుడు కేవలం ఐదారు అడుగలకు కుదించుకుపోయింది. ప్రతీ ఏటా భారీ వర్షాలు కురువడంతో వరద నీరంతా షెల్లార్లలోకి చేరి మణికొండ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరదలు వచ్చినప్పుడు నాయకులు, అధికారులు వచ్చి మీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని చెప్పడం, ఆనక ముఖం చాటేయడం ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉంది. బుల్కాపూర్ నాలాను కబ్జాపాలు కాకుండా కాపాడితే వరద నీరు సులభంగా దిగువకు వెళ్లి, ప్రజలకు ఇబ్బందులు ఎలాంటి ఇబ్బందులు ఎదురవవు. కానీ ఈ విషయంపై అధికారులుగాని, నాయకులు గాని దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. తాజాగా ఈ నాలాపై, మణికొండ సర్వే నెంబర్ 261.లో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఉన్న ఖాళీ స్థలంలో గదులు నిర్మిస్తున్నారు. 60.గజాల పట్టాలున్నాయంటూ, అవి పేద వారివంటూ చెబుతూ గదులు నిర్మించడం, ఇతరులకు అమ్మడం సొమ్ము చేసుకోవడం జరుగుతుంది. ఈ విషయంపై సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు స్పందించి, బుల్కాపూర్ నాలాను కబ్జా నుంచి విడిపించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



మణికొండ బుల్కాపూర్ నాలా స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలు

**ఆర్.ఐ వివరణ..** బుల్కాపూర్ నాలాపై జరుగుతున్న ఆక్రమణల విషయంపై గండిపేట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ కుమార్‌ను వివరణ అడిగితే కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెడ్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్ట పరంగా కఠినంగా వ్యవహరిస్తామని, అతి త్వరలోనే అక్రమ కట్టడాలను కూల్చి వేస్తామని వివరించారు. ఇదే అంశంపై ఇరిగేషన్ ఏఈ నిఖేష్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఇరిగేషన్ అధికారుల అలసత్వం, పరోక్ష సహకారంతోనే ఈ కబ్జా తతంగం జరుగుతుందని మణికొండ ప్రజలు ఆరోపిస్తున్నారు.

# నేడే స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్

ధర్నాచౌక్, ఆగస్టు 18, ప్రభాతవార్త: ఇందిరాపార్కు నుండి వీఎస్టీ వరకు 2.62 కిలీమీటర్ల పొడవుతో నిర్మించిన స్టీల్ బ్రిడ్జ్ నేటి నుండి ప్రజలకు అందుబాటులోకి రానుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖలమంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, జీహెచ్‌ఎంసీ కమీషనర్ రోనాల్డ్ రోస్ లతో కలసి స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభోత్స ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్‌టీసీ క్రాస్ రోడ్సు, వీఎస్టీ జంక్షన్‌లలో వాహనాల రద్దీతో నిరంతరం ట్రాఫిక్ స్తంభించి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. ప్రజల ట్రాఫిక్ కష్టాలు తొలగించటం కోసం మున్సిపల్‌శాఖా మంత్రి కేటీఆర్ చొరవతో ఈ స్టీల్ బ్రిడ్జ్ నిర్మించటం జరిగిందని తెలిపారు. నగరంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నూతన బ్రిడ్జ్‌లను నిర్మిస్తోందని పేర్కొన్నారు. శనివారం ఈ బ్రిడ్జ్ ప్రారంభంతో వాహనదారుల ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని అన్నారు. ఈ బ్రిడ్జ్‌కి మాజీ హోం శాఖా మంత్రి నాయిని నరసింహారెడ్డి పేరును ఖరారు చేయటం ఎంతో సంతోషిదగ్గ విషయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారునిగా, కార్మికుల పక్షపాతిగా, మంత్రిగా ఆయన చేసిన సేవలను గౌరవిస్తూ ఈ బ్రిడ్జ్‌కి ఆయన పేరు పెట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ నాయకత్వంలో, మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ విశ్వనగరంగా రూపుదిద్దుకుంటున్నదని అన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించే విధంగా పెద్ద ఎత్తున రోడ్డు కనెక్టివిటీ కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, త్వరలోనే మూసీ నది అభివృద్ధి పనులను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. మూసీ నది వెంట ఇండ్లను నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించి, వారికి పునరావాసం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం చేపట్టటం జరిగిందని, అంతే కాకుండా ఎల్‌ఈడీ లైట్‌ల ఏర్పాట్లు, సీఆర్‌ఎంపీ కార్యక్రమం క్రింద రోడ్ల నిర్మాణం, ఫుట్‌పాథ్‌ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. నిర్మాణం అయిన ఇండ్లను త్వరలోనే పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ నార్త్ జోన్ జోనల్ కమీషనర్ రవి కిరణ్, ప్రాజెక్ట్స్ సీఈ దయానంద్, ఎస్‌ఈ రవీందర్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఎం.ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నల్లా కనెక్షన్లలో దళారీ వ్యవస్థ

**సొమ్ములిస్తేనే.. ధరఖాస్తు పరిశీలన.. లేదంటే తిరస్కరణ**

**దుండిగల్ వాటర్‌బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా**

**రెండేళ్ళుగా ఇబ్బందులు పడుతున్నాము: 120 బస్తీవాసులు**

దుండిగల్, ఆగస్టు 18 ప్రభాతవార్త: ఆడబిడ్డలు నీళ్ళ కోసం బిందెలు పట్టుకొని బయటికి వెళ్ళాల్సిన పనిలేదు.. ఇంటింటికి నల్లాకనెక్షన్లు ఇచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించామని ప్రభుత్వం పదేపదే చెబుతున్న ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. నల్లా కనెక్షన్ల కోసం రెండేళ్ళుకు పైగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ధరఖాస్తులు చేసుకున్నాం సార్ జర చూడండి నీళ్ళు లేక గోస పడుతున్నాము అని వేడుకున్న ఫలితం లేదు. ఎందుకంటే నల్లాకనెక్షన్లలో దళారీ వ్యవస్థ రాజ్యమేలుతుంది. డబ్బులు ఇస్తేనే ధరఖాస్తు పరిశీలన జరిగి కనెక్షన్ అందుతుంది. లేదంటే వివిధ కారణాలు చెబుతూ తిరస్కరణకు గురవుతుది. దీంతో విసిగిపోయిన బస్తీవాసులు శుక్రవారం వాటర్‌బోర్డు ఎదుట ధర్నాకు దిగారు. బస్తీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ 8వ వార్డు పరిధి 120లో సాయిపూజకాలనీ, మల్లికార్జుననగర్, బి.చంద్రశేఖర్‌రెడ్డినగర్, రాజుబస్తీలలో సుమారు నాలుగు వేలకు పైగా నిరుపేద కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. రోజువారీ కూలీపనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం జీవో 58,59ల కింద రెండుసార్లు అవకాశం కల్పించడంతో 90శాతంకు పైగా లబ్ధిపొందారు. లబ్ధిదారులు పక్కా నివాసాలను ఏర్పరచుకొని నల్లా కనెక్షన్ల కోసం వాటర్‌బోర్డు అధికారులను సంప్రదించగా ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారి సూచన ప్రకారం ధరఖాస్తు చేసుకొని వెళ్ళగా వివిధ కారణాలతో తిరస్కరిస్తున్నారు. మరలా ధరఖాస్తు చేసుకున్న అదే జరుగుతుంది. ఇలా రెండు సంవత్సరాలుగా నల్లా కనెక్షన్ల కోసం తిరుగుతూనే ఉన్నారు.

**దళారీ వ్యవస్థ నడుస్తుంది..** స్థానిక నాయకులకు అడిగినంత ఇస్తేనే నల్లా కనెక్షన్లు ఇస్తున్నారు లేదంటే తిరస్కరిస్తున్నారని బస్తీవాసులు వాపోతున్నారు. నల్లా కనెక్షన్ల కోసం ధరఖాస్తు చేసుకున్న వారిలో కొంతమంది నాయకులను సంప్రదించగా పలు సూచనలు చేసినట్లు తెలిపారు. వారి సూచనల ప్రకారం సదరు వ్యక్తులను కలిసిన వారికి పని జరుగుతుంది. పేదలం జర కనికరించండి అనే వారివి తిరస్కరణకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలీపనులు చేసుకొని పొట్టనింపుకుంటున్నాం నీళ్ళ ఇవ్వడానికి పైసలు ఎందుకియ్యాలే అని ప్రశ్నిస్తే అంతేసంగతులు. పేదలు అని చూడకుండా ఒక్కో కనెక్షన్‌కు రూ,10వేల నుండి 15వేల వరకు వసూలు చేస్తున్నారని, కొంతకాలంగా ఇదే దందా నడుస్తుందని మండిపడుతున్నారు.



బస్తీవాసులతో కలిసి వాటర్‌బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అక్బర్

**రెండేళ్ళుగా ఇబ్బందులు పడుతున్నాం..**

**సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం : బస్తీవాసులు**

ప్రభుత్వం ఒకరూపాయి కడితే నల్లా కనెక్షన్లు ఇస్తాం అంటుంది. ధరఖాస్తులు చేసుకొని వెళితే దళారీ వ్యవస్థ చెప్పిందే నడుస్తుంది. రెండు సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నాము. ప్రజలకు కనీస సౌకర్యాల్లో భాగంగా తాగునీరు అందించడం ప్రభుత్వం బాధ్యత. ప్రభుత్వ ఆదేశానుసారం కాకుండా స్థానిక నాయకుల ఆదేశానుసారం అధికారులు నడుచుకుంటున్నారు. వారి చెప్పిన వారికే కనెక్షన్లు ఇస్తున్నారు. లేదంటే వివిధ కారణాలు చెబుతూ ముప్పు తిప్పలు పెడుతున్నారు. దీంతో వాటర్‌బోర్డు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాము. ఇప్పటికైనా స్పందించి నల్లా కనెక్షన్లు ఇచ్చి సమస్యను పరిష్కరించాలి. లేని పక్షంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడుతామని బస్తీవాసులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎండి.అక్బర్, మోయిన్‌అలీ, మన్సూర్, హుస్సేన్, ఉషారాణి, షాబానాబేగం, నాగమణి, జావీద్, సద్దామ్, షఫీ, జకీయాభీలతో పాటు పెద్దసంఖ్యలో బస్తీవాసులు పాల్గొన్నారు.

## అమ్మవారికి సాక సమర్పించేందుకు

### ఉజ్జయినీ మహాకాళీ ఆలయానికి పోటెత్తిన భక్తులు



బేగంపేట ఆగస్టు 18, ప్రభాతవార్త : సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో అమ్మను దర్శించుకుని సాకను సమర్పించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయానికి ఉదయం నుంచే భక్తులు తరలి రావడంతో ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. ఆషాడ బోనాల జాతర లో అమ్మవారు తనకు ఐదు వారాల పాటు సాక సమర్పించాలంటూ కోరడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు వరుసగా నాలుగు వారాలుగా అమ్మవారికి సాక సమర్పిస్తున్నారు. శుక్రవారం ఉదయం గం 10.30నిల నుంచి అమ్మ వారికి 108 సాకలతో సుమారు 1500మంది కి పైగా మహిళా భక్తులతో సాక సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి, ఛైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, భక్తులు పాల్గొన్నారు.

## సమస్యల పరిషారానికి రోడెక్కిన బిజెపి శ్రేణులు



లాలాపేట్ రోడ్డుపై బైటాయించి నిరసన చేస్తున్న మాజీ మేయర్ బండ కార్తిక రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి

తార్నాక, ఆగస్టు 18 ప్రభాతవార్త: ఎన్నికలు సమీపిస్తుండటంతో సీఎం కేసీఆర్ ఆనేక సంక్షేమ కార్యక్రమాల పేరుతో మరో సారి మోసం చేసేందుకు ముందుకు వస్తున్నారని మాజీ మేయర్ బండ కార్తిక చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి పేర్కొన్నారు. తార్నాక డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు, పెండింగ్‌లో ఉన్న పెన్షన్ సమస్యలపై శుక్రవారం లాలాపేట్ లో రోడెక్కి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మేకల సారంగపాణి, మాజీ మేయర్ బండకార్తిక రెడ్డి మాట్లాడుతూ తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో ఇదిగో డబుల్ బెడ్‌రూం ఇండ్లు అదిగో ఇండ్లు అంటూ ప్రభుత్వం పబ్బం గడుపుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆదం విజయ్‌కుమార్, బండపల్లి సతీష్ గౌడ్, రాముడవర్మ, నాగేశ్వర్ రెడ్డి, పోచయ్య యాదవ్, వెంకటేష్ గౌడ్, వీరన్న, సుక్క గణేష్ ముదిరాజ్, బండ శివారెడ్డి, అనిత, ఉపేందర్ యాదవ్, శాతర, గండి కోట నర్సింహ్మా, బిక్షపతి, తార్నాక డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలు సత్యవతి పాల్గొన్నారు.

## డబల్ బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో మరోసారి మోసం

### తెలంగాణ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి ధ్వజం



మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఫిల్మ్‌నగర్, ఆగస్టు 18 ప్రభాతవార్త : డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి మోసం చేస్తున్నదని తెలంగాణ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ధ్వజం ఎత్తారు. అర్హులైన పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, బీసీబంధు, దళితబంధు, నూతన రేషన్‌కార్డు, నూతన పెన్షన్లు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఖైరతాబాద్ చౌరస్తాలో బిజెపి ఆధ్వర్యంలో రాస్తారోకో ధర్నా చేయడం జరిగింది. డబల్ బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో కెసిఆర్ ప్రభుత్వం 9ఏళ్ళుగా మోసం చేస్తుందని, ఇండ్లు వస్తాయన్న ఆశతో పేదలు ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మీ పథకాలను కేవలం కొంతమందికే వర్తింపజేయడం వల్ల అనేక మందికి అన్యాయం జరుగుతోందని, కేవలం అధికారపార్టీకి అనుకూలంగా ఉన్న వారికి, ఎమ్మెల్యే అనుచరులకే ఇచ్చిన దాఖలాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ బిజెపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అనుకున్న ఆశయాలు నెరవేరలేదు

### టిజెఎస్ అధ్యక్షుడు ప్రొ.కోదండరాం





మాట్లాడుతున్న ప్రొ.కోదండరాం, ప్రొ.గాలి వినోద్‌కుమార్

తార్నాక, ఆగస్టు 18 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రంలో అనుకున్న ఆశయాలు నెరవేరలేదని ప్రొ.కోదండరాం ఆరోపించారు. అన్ని రాజకీయ పార్టీలకు మన మేనిఫెస్టోను అందిద్దాం అనే నినాదంతో శుక్రవారం ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ సెమినార్ హాల్లో తెలంగాణ స్టూండెట్స్ పొలిటికలర్ జాక్ ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశానికి ప్రొ.కోదండరాం హాజరై మాట్లాడుతూ సామాజిక తెలంగాణ అన్నింటికి పరిష్కార మార్గాలు చూపిస్తుందని అభిప్రాయపడ్డారు. అనంతరం తలెంగాణ విఠల్ మాట్లాడుతూ మరో సారి విద్యార్థి యువత ప్రత్యక్ష రాజకీయాలకు వచ్చి భూమిపుత్రులకు హక్కులు సాధించుకునే దిశగా కృషి చేయాలన్నారు. డా.రియాజ్, డా.పృథ్వీరాజ్, మాట్లాడుతూ స్వరాష్ట్ర ఉద్యమంలో త్యాగాలు చేసిన వాళ్లు రేపు రాష్ట్రాన్ని ఏలుకునే దిశగా సంఘటితం కావాలని సూచించారు. ప్రొ.ముత్తయ్య, ప్రొ.గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వార్గాలకు సమాన పనరుల పంపిణీ రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావవేశంలో జేఏసీ ఛైర్మన్ చంద్రశేఖర్, ప్రసిడెంట్ వలిగొండ నరసింహ్మా, జనరల్ సెక్రటరీ వంశి నాయక్, విద్యార్థి నాయకులు దర్శన్, వెంకట్ నాయక్, వేణుగోపాల్, సత్య రెడ్డి, శ్రీను, అంబేద్కర్, ప్రశాంత్, శశిగౌడ్, జి.నవీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించేందుకు కృషి

**ప్రముఖ సినీ నటి మంచు లక్ష్మీ**



మణికొండ ప్రభుత్వ పాఠశాలలో స్మార్ట్ క్లాస్‌రూంను ప్రారంభిస్తున్న ప్రముఖ సినీనటి మంచు లక్ష్మీ.

నార్సింగి, ఆగస్టు 18 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించేందుకు మావంతు సహకారం అందిస్తామని ప్రముఖ సినీ నటి మంచు లక్ష్మీ పేర్కొన్నారు. శుక్రవారం మణికొండ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టీచ్‌ఫర్ ఛేంజ్, వేణిరావు ఫౌండేషన్ల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన "స్మార్ట్ క్సాల్ రూం"ను రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుసీంద్రరావ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆమెపై పూలవర్షం కురిపించి,ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే విద్యార్థులకు ఆంగ్ల విద్యను నేర్పించడం తప్పని సరి అయ్యిందన్నారు. విద్యార్థులలో నైపుణ్యతను పెంచేందుకు, డిజిటల్ తరగతుల ద్వారా శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఇప్పటి వరకు యాదాద్రి, గద్వాల, శ్రీకాకుళం జిల్లాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించామని, ఇప్పుడు రంగారెడ్డి జిల్లాలో 25.పాఠశాలలను ఎంపిక చేసుకొని అన్నింటిలో స్మార్ట్ తరగతి గదులను ఏర్పాటు చేస్తామన్నారు. ౧. ఈ మంచి పనికి వేణిరావ్ సంస్థ అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో వేణిరావ్ ట్రస్టీ రత్నారెడ్డి, ఎంఇఓ రాంరెడ్డి, టీచ్‌ఫర్ చేంజ్ సంస్థ నిర్వాహకులు చైతన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగ్యానాయక్, ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ 2021 ప్రతిభా పురస్కారాలు

నాంపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీయేటా వివిధ రంగాల్లో విశేష కృషిచేసిన 12మంది ప్రముఖులను ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తూ వస్తోంది. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల సంఘం ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులను పురస్కార గ్రహీతలుగా ఎంపిక చేసింది. తెలుగు విశ్వవిద్యాలయం 2021 సంవత్సరానికిగాను ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన వారిలో గింజల నరసింహారెడ్డి కవిత; తేరాల సత్యనారాయణశర్మ పరిశోధన; బి.నరహరి చిత్రలేఖనం; డా. ఈమని శివనాగిరెడ్డి శిల్పం; మేలట్టూరు ఎస్.కుమార్ నృత్యం; పి.పూర్ణచందర్ సంగీతం జి.వల్లీశ్వర్ పత్రికారంగం; దెంచనాల శ్రీనివాస్ నాటకరంగం; వెద్మ శంకర్ జానపద కళారంగం;; డా. ముదిగొండ అమరనాధశర్మ అవధానం; డా. కొండపల్లి నీహారిణి ఉత్తమ రచయిత్రి; డా. జి.అమృతలత నవల/కథ ఉన్నారు. ఎంపికైన పురస్కార గ్రహీతలను ఘనంగా సత్కరించి ఒక్కొక్కరికి 20,116 రూపాయల నగదు బహుమతిని అందజేస్తామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: మంత్రి నిరంజన్‌రెడ్డి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రి నిరంజన్‌రెడ్డి

సైఫాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త: ప్లాస్టిక్ వాడకం మానవ జాతి మనుగడకే ప్రమాదకరమని, వాడకాన్ని ఆపితేనే భావితరం సురక్షితమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. కాలుష్యాన్ని హరించేది చెట్లని ఎక్కువగా మొక్కలను నాటాల ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ రూపొందించిన పర్యావరణ నినాదాల వాల్ పోస్టర్‌ను శుక్రవారం మంత్రి తన నివాసంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు, రిటైర్డ్ డిఎస్‌పి గాంధీనారాయణ, కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్సీహెచ్ రంగయ్య, సౌత్ ఇండి యన్ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు శామ్ కెఉడ్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కోఆర్డినేషన్ కమిటీ ఎన్నిక

హైదరాబాద్, ఆగస్టు 18,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (బడిచౌడి)ఆధ్వర్యంలో శుక్రవారం 8పెన్షనర్ల సంఘాల సమావేశం నిర్వహించి కోఆర్డినేషన్ కమిటీని ఎనుకున్నారు. చైర్మన్‌గా జి.దామోదర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్‌గా సి.చంద్రశేఖర్, ట్రెజరర్‌గా ఎం.హన్మత్‌రెడ్డి, కోచైర్మన్లుగా వి.రాజమల్లయ్య, పి.వెంకటయ్య, వైస్ చైర్మన్లుగా ఎస్.లక్ష్మారెడ్డి, జి.జంగయ్య, సెక్రటరీగా రాజేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రామాంజనేయులు, యాదయ్య, పబ్లిక్‌సిటీ సెక్రటరీలుగా బి.ప్రహ్లాదరావులను ఎన్నుకున్నారు. ఈకమిటీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కలిసికట్టుగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

## అడ్డగుట్ట అభివృద్ధికి నిరంతరం కృషి

**కార్పొరేటర్ లింగాని ప్రసన్న**



తుకారాంగేట్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్న తదితరులు

అడ్డగుట్ట, ఆగస్టు 18 ప్రభాతవార్త: డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ సహాయ సహకారాలతో అడ్డగుట్ట డివిజన్‌ను మరింత అభివృద్ధిపర్చేందుకు దశల వారిగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం తుకారాంగేట్ గడ్డమీది బస్తీలో లక్షలాది రూపాయల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం సరిత, సెక్షన్ మేనేజర్ నిఖితా రెడ్డి, గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు నక్క మధు, శ్రీనివాస్ గౌడ్, పెండెం మనోహర్, సత్తయ్య గౌడ్, వసంత, మమ్మద్, సుధాకర్, దేవయ్య, ఎం.ఇస్మయిల్, గోపి, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్విన్‌కాలనీలో మౌలిక వసతులు కల్పించేందుకు శాయశక్తుల కృషి : కార్పొరేటర్ దొడ్ల



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్ట్ 18, ప్రభాతవార్త : ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో మౌలిక వసతులు కల్పించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా ఎల్లమ్మబండ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో ఏడు లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిర్మాణ పనులు పూర్తయ్యాయి కాబట్టి సీసీ రోడ్డును మంచిగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, మల్లేష్, ముజ్జీబ్, షారుఖ్, ఇంతియాజ్, సతీష్, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**

అల్వాల్, ఆగస్టు 18 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. శుక్రవారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ రాజు వీకర్ సెక్షన్‌లో 25లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అభివృద్ధికి ప్రజలు సహకారం అవసరమని మైనంపల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ కార్తీక్, ఎఇ అరుణ్, ఇర్కో ఇన్‌స్పెక్టర్ వెంకట్ రావు బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, మోసిన్, భాస్కర్, రఘునాథ్, లక్ష్మణ్, ముదిరాజ్, అమృత, స్వప్న, రమాదేవి పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్**



షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

మెహిదీపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త : అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ కోరారు. పేద ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందని తెలిపారు. షేక్‌పేట్ మండల పరిధిలోని 84 మంది లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం టోలిచౌకిలోని ఎస్.ఎస్.ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేసి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేయడం జరుగుతుందని తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు వాటిని పరిష్కరించాలన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, షేక్‌పేట్ మండల అధికారులు సిబ్బంది, లబ్ధిదారులు ఉన్నారు.

## ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న బిఆర్ఎస్ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్ యాదవ్, గీత పారిశ్రామిక సహకార సంఘం పూలేకోన ప్రతినిధులు

బేగంబజార్, ఆగస్టు 18 ప్రభాతవార్త: తెలంగాణ బహుజన విప్లవ వీరుడు, గోల్కొండను ఏలిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆదర్శప్రాయుడని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ యువ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు పురానాపూల్‌లోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374,వ జయంతి వేడుకలు పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ఆశీష్ కుమార్‌యాదవ్‌తోపాటు సంఘం ద్వారా పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమం లో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం పూలే కోన అధ్యక్షులు కొత్త నవీన్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నిర్మల నీలకంఠంగౌడ్, ఉపాధ్యక్షులు బుర్ర బాస్కర్‌గౌడ్ కోశాధికారి గోదా వెంకటేష్‌గౌడ్, మనుజెందర్‌గౌడ్, యజ్ఞేశ్వర్‌గౌడ్, బి.శ్రీని వాస్ గౌడ్, సందీప్‌గౌడ్, ఎం.లింగంగౌడ్, వాసుగౌడ్, అశోక్‌గౌడ్, ఎం.శివాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి : బిజెపి ఆందోళన

**అరగంట పాటు ట్రాఫిక్ జామ్.. పలువురి అరెస్ట్**



ఆందోళనలతో పాల్గొన్న బిజెపి శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్ట్ 18, ప్రభాతవార్త : అర్హులైన లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ కూకట్‌పల్లి అసెంబ్లీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమం ఆందోళన దిశగా జరిగింది. శాంతియుతంగా చేస్తున్న దీక్ష ఒక్కసారిగా ముంబై జాతీయ రహదారిపైకి దూసుకువచ్చి బిజెపి నేతలు కార్యకర్తలు ఆందోళన చేపట్టడంతో దాదాపు అరగంట పూర్తిస్థాయిలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. రోడ్డుపై బైఠాయించి ముఖ్యమంత్రి కెసిఆర్‌కు వ్యతిరేక నినాదాలు చేస్తూ ఆందోళన తీవ్రతరం చేశారు. కూకట్‌పల్లి సిఐ సురేందర్‌గౌడ్ ఇతర సిబ్బంది ఒక దశలో బిజెపి నేతలను అడ్డుకొని రాస్తారోకో నిలుపు చేసి పలువురిని అదుపులోకి తీసుకొని సొంత పూచికత్తుపై విడుదల చేశారు. మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డితో పాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, వడ్డేపల్లి శరణ్, అద్వానీ సూర్యారావు, వై.పద్మయ్య, కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్, తూము శైలేష్ కుమార్, సాయినాథ్‌రెడ్డి, నాగరాజు, సాయి తదితరులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. అంతకుముందు మూసాపేట చౌరస్తా వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వడంలో తెలంగాణ ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ బిజెపి ఆందోళన తీవ్రతను చేస్తామని హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కార్మిక ఉద్యోగ పక్షపాతి సిఎం కెసిఆర్: నారాయణ

చిక్కడపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త: సిఎం కెసిఆర్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ వారికి ఉద్యోగభద్రత కల్పిస్తూ వేతనాలు పెంచుతూ ఈ వర్గాన్ని అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తున్నారని రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి చైర్మన్ పి.నారాయణ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వాటర్‌బోర్డు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచినందుకుగాను సిఎం కెసిఆర్, కెటిఆర్‌లకు కృతజ్ఞత సభ జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా నారాయణ హాజరై ప్రసంగించారు. ఇటీవల వాటర్‌బోర్డులో పనిచేసే దాదాపు 4వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీవో 60ద్వారా వేతనాలు పెంచడమే కాకుండా వారందరికి ఉద్యోగభద్రత కల్పిస్తూ పిఆర్‌సిలో భాగస్వాములు చేసినందుకు కార్మికులంతా సిఎం కెసిఆర్‌కు రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజరత్నం, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్ బాల్‌రాజ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న రుక్మిణీబాయి స్మారక అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు

కంటోన్మెంట్, ఆగస్ట్ 18 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం వెస్ట్ మారేడ్‌పల్లిలోని సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో రుక్మిణీబాయి స్మారక అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు 2వ రోజు కొనసాగాయి. వాలీబాల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్, క్రికెట్ వంటి పోటీలు జరుగగా, వాలీబాల్ సీనియర్ బాలికల విభాగంలో బోయిన్‌పల్లిలోని పల్లవి మోడల్ స్కూల్‌పై సికింద్రాబాద్ ఆంథోనీస్ విజయం సాధించింది. అదే విధంగా వాలీబాల్ బాలుర విభాగంలో సుచిత్ర జంక్షన్ అకాడమీపై సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.జ్యోతి మధుసూదన్ రావ్, డైరెక్టర్లు స్వామి, పూజా, జనరల్ మేనేజర్ ఉపేంద్ర రవి, సిఓఓ.విజయ్ శంకర్, అకాడమిక్ డైరెక్టర్ ఎం.ఎం.అగస్టిన్ ప్రిన్సిపాల్ సుజాత పాల్గొన్నారు.

# అట్టడుగు వర్గాల బతుకుల్లో వెలుగులు నింపిన సర్దార్ సర్వాయి పాపన్న





న్యూ బోయిన్‌పల్లిలో సర్దార్ సర్వాయి పాపన్నకు నివాళులర్పిస్తున్న జంపనప్రతాప్ తదితరులు, ఓల్డ్‌అల్వాల్‌లో జయంతి వేడుకలో ఎమ్మెల్యే మైనంపల్లి





పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, వెంకటరెడ్డి

**సర్దార్ పాపన్న గౌడ్ సేవలు మరువలేనివి : మంత్రి మల్లారెడ్డి**

**కంటోన్మెంట్..** బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన సేవలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర కార్మిక మంత్రి సి.హెచ్.మల్లారెడ్డి, కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షులు జంపనప్రతాప్, జక్కుల మహేశ్వర్ రెడ్డిలు కొనియాడారు. పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కంటోన్మెంట్ 1వ వార్డు జయనగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యూ బోయిన్‌పల్లి గౌడ సంఘం అధ్యక్షుడు కళ్యాన్ గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మన్నెక్రిషాంక్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామక్రిష్ణ, ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, జాతీయ అథ్లెటిక్ చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, బిజెపి నాయకుడు బానుక మల్లికార్జున్ తదితరులు పాల్గొని ఆయన చేసిన సేవలను కొనియాడారు.

**బానిస బతుకుల్లో వెలుగు నింపిన మహనీయుడు సర్ధార సర్వాయి పాపన్నగౌడ్ : వడ్డేపల్లి రాజేశ్వరరావు**

**కెపిహెచ్‌బి కాలనీ..** బానిస బతుకుల్లో చైతన్యం తీసుకువచ్చిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర రావు పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో శుక్రవారం రాచమల్ల శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి వడ్డేపల్లి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాచరికపు వ్యవ స్థలో శిస్తు కట్టించుకుని అణిచేయడమే తప్ప పరిపాలన అంటే ఏంటో తెలియని చీకటి రోజుల్లో అట్టడుగు వర్గాల బానిస బతుకుల్లో వెలుగులు నింపేందుకు పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని అన్నారు. కార్యక్రమంలో స్వరూప, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్, డాకయ్య, కళ్యాణి, పాండు, శ్రీనివాస్, నగేష్, గౌడ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**అల్వాల్..** సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అతిధిగా పాల్గొన్ని ఓల్డ్‌అల్వాల్‌లోని పాపన్న విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. అల్వాల్ గౌడ సంఘం మరియు రాష్ట్ర గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి సాయిరామ్ గౌడ్ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ గౌడ్, రాజ్ జితేందర్‌నాథ్ బిఆర్ఎస్ నేతలు కొండల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రవి గౌడ్, వెంకటేష్ గౌడ్, ఢిల్లీ పరమేష్, ఉదయ్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

**సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే మాగంటి**

**యూసుఫ్‌గూడ..** అన్ని వర్గాల ప్రజలకు సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ చేసిన సేవలు ఎన్నటికి మరువలేనివని బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు, జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటి గోపినాథ్ అన్నారు. శుక్రవారం బోరబండ సైట్ 2 కాలనీలో బోరబండ గౌడ సంఘం అధ్యక్షులు జి.లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ కమ్యూనిటి హాల్ వద్ద జయంతి వేడుకల్లో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక గౌడ సంఘానికే కాకుండా అన్ని మతాలను కులాలను గౌరవిస్తూ అందరి కోసం పోరాటం చేసిన గొప్ప యోధుడు పాపన్న గౌడ్ అనీ ఆయన సేవలను స్మరించుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో గౌడ సంఘం చైర్మన్ పోచయ్య గౌడ్, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కృష్ణమోహన్, డివిజన్ ఇన్‌చార్జ్ సిరాజ్, సైట్ 2 అధ్యక్షులు శివకుమార్ గుప్త, దేవమణి, రాము, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

**పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్: ఎమ్మెల్యే వివేకానంద్**

**జీడిమెట్ల..** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 373 జయంతి సందర్భంగా గాజులరామారం డివిజన్ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహ ఆవిష్కరణకు ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈసందర్భంగా పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భూస్వాముల చేతుల్లో, గడీలలో మగ్గిపోతున్న అణగారిన వర్గాలకు స్వేచ్చను, రాజ్యాధికారాన్ని ఇచ్చి ఒక సైన్యాన్ని నిర్మించిన మహా పోరాట యోధుడు సర్వాయి పాపన్నగౌడ్ అన్నారు.

**బహుజనల ఐక్యత కోసం పోరాడిన వీరు సర్దార్‌సర్వాయిపాపన్న: ఎన్.గౌతమ్‌రావు**

**హైదరాబాద్..** మొగల్ సామ్రాజ్యం మెడలు వంచి బహుజనుల ఐక్యత కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు శుక్రవారం గోల్నాక డివిజన్ బిజెపి ఓబీసీ మోర్చ ఆధ్వర్యంలో గంగాధర్‌నగర్ వద్ద జరిగింది. ముఖ్యఅతిథిగా బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, జోగులాంబ జిల్లా బిజెపి ఇంచార్జ్ వెంకటరెడ్డి హాజరై సర్వాయిపాపన్న చిత్రపటానికి నివాళులు అర్పించి ప్రసంగించారు. ఈకార్యక్రమంలో బిజెపి డివిజన్ కన్వీనర్ మూల రవీందర్‌గౌడ్, ఎం.శ్యామ్‌రాజ్, సి.కృష్ణగౌడ్, వై.అమృత, కేసరి, నర్సింగరావు యాదవ్, మహ్మద్ సలీమ్, దామోదర్ నాయుడు, బి.ఈశ్వరరావు, ఎస్.రాజేష్, అనీల్‌చారి, ఎస్.శ్రీధర్‌గౌడ్, మహ్మద్ ఖాజా, కె.సునీల్, కె.గణేష్, ఎ.బస్వరాజ్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా భవాని శంకర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



జిటియస్ శ్రీవీరాంజనేయ భవాని శంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయం శ్రీభవాని శంకర వార్షిక బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న శాసన సభ్యులు మాగంటిగోపినాథ్

యూసుఫ్‌గూడ, ఆగష్టు 18, ప్రభాతవార్త : వెంగళరావు నగర్ జిటియస్ కాలనీ శ్రీవీరాంజనేయ భవాని శంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయంలో దేవదాయ ధర్మధాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీభవాని శంకర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్ర వారం జరిగిన రాజశ్యామల హోమం, వారాహి హోమంలో జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటి గోపినాథ్, డివిజన్ కార్పొరేటర్ దేదిప్యరావులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో దేవధాయ ధర్మదాయ శాఖ చైర్మన్ చిన్న రమేష్, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు వేణుగోపాల్ యాదవ్, మధురానగర్ కాలనీ అధ్యక్షులు సాంబశివరావు, వెంగళరావు నగర్ కాలనీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కమిటి సభ్యులు లక్ష్మీ, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, శ్రీనువాస్, సత్యనారాయణ, శ్యామ్‌రావు ముదిరాజ్, పవన్ ముదిరాజ్, సురేష్ ముదిరాజ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## 21న స్వరనీరాజనం

రవీంద్రభారతి, ఆగస్టు 18 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో 21 సోమవారం మధ్యాహ్నం 1.30గంటల నుండి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జయహో పోలీస్ శీర్షికన సీల్‌వెల్ సినీసుస్వరాల్లో ప్రముఖ గాయని ఆమని నేతృత్వంలో వర్థమాన గాయకులచే దేశభక్తి గీతాలతో రక్షణ, పోలీసు శాఖలలో విశేషసేవలు అందిస్తున్న త్యాగధనులు పలువురికి సినీగీతలహరితో స్వరనీరాజనం, ఘనసత్కారం తదితర కార్యక్రమాలను నిర్వహించి ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు అంకితమివ్వనున్నట్లు సీఎండి బందారు సుబ్బారావు; శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి, ప్రఖ్యాత నవరసగాయని ఆమని మీడియాకు తెలిపారు. తెలంగాణ శాసనసభ తొలిసభాపతి సిరికొండ మధుసూదనాచారి సభాధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హోంశాఖమంత్రి మహ్మూద్‌అలీ, విశిష్ట అతిథులుగా కోలేటి దామోదర్‌గుప్త, వై.విజయ్‌కుమార్, మహ్మద్‌రఫీ, కుసుమభోగరాజు, జగదీష్, పట్టాభి, డా. అక్కినేని వెంకటలక్ష్మి తదితరులు పాల్గొంటారని, అధికసంఖ్యలో సినీసంగీత ప్రేమికులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సుబ్బారావు, ఆమని కోరారు.

## 49 మంది లబ్దిదారులకు చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భేతిసుభాష్ రెడ్డి, కార్పోరేటర్ పన్నాల

నాచారం, ఆగస్టు 18 ప్రభాతవార్త: పేదింటి ఆడబిడ్డల పెండ్లికి పెద్దన్నగా సీఎం కేసీఆర్ నిలుస్తున్నారని ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, కార్పోరేటర్ పన్నాల దేవవేందర్ రెడ్డి పేర్కొన్నారు. మల్లాపూర్ డివిజన్‌కు చెందిన 49 మంది లబ్దిదారులకు సుమారు రూ.49లక్షల చెక్కులను వారు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భేతిసుభాష్ రెడ్డి, పన్నాల మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు సీఎం కేసీఆర్ పెద్దన్నగా మారి కళ్యాణ లక్ష్మి, శాదిముభారక్ చెక్కులను అందిస్తూ వారికి అండగా ఉంటూ పేదల కష్టాల్లో పాలుపంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాండా వాసుదేవ్ గౌడ్, దుర్గయ్య, శ్రవణ్ తధితరులు పాల్గొన్నారు.

### బిసి జాగృతి ఆధ్వర్యంలో పాపన్న జయంతి



పాపన్న చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న కె.పి మురళీకృష్ణ, అచ్చినరమేష్, మహేష్ తదితరులు

హైదరాబాద్, ఆగష్టు 18, ప్రభాతవార్త: సర్దార్‌సర్వాయి పాపన్న 373వ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ బిసి జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. బర్కత్‌పురా చౌరస్తాలో పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా అధ్యక్షులు కెపి మురళీకృష్ణ మాట్లాడుతూ సర్వాయి పాపన్నగౌడ్ మొగల్ సామ్రాజ్యంపై పోరాడి, గోల్కొండ కోటను స్వాధీనం చేసుకున్న మొట్టమొదటి బహుజన బిడ్డఅని ఆయన ఆశయసాధన కోసం అందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అచ్చిని రమేష్, రాష్ట్ర కార్యదర్శి పాతకోటి మహేష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పిల్లిబాల్‌రాజ్, తండు లాలయ్యగౌడ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గొడవ పడిన మహిళపై కేసు నమోదు

యూసుఫ్‌గూడ, ఆగష్టు 18, ప్రభాతవార్త : పార్కింగ్ విషయంలో గొడవ పడిన మహిళపై బోరబండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. బోరబండలో నివసించే మేహార్ ఫాతిమా(29) ఈనెల 15వతేదిన రాత్రి 10గంటల సమయంలో ఇంటి పక్కన నివాసం ఉండే ఖలీద్‌తో పార్కింగ్ విషయంపై గొడవ పెట్టుకుంది. ఈవిషయంలో వసీయుద్దీన్ మధ్యవర్తిగా వ్యవహరిస్తూ రాత్రి సమయంలో గొడవలు ఎందుకు అనీ ఇద్దరిని సముదాయిస్తుండగా మేమర్ ఫాతిమా వినక పోగా ఆవేశంతో అతనిని సైకిల్‌తో కొట్టి గాయపరిచింది. ఈఘటనపై ఇరువర్గాలు బోరబండ పోలీస్ స్టేషన్ రాగా మేహార్ ఫాతిమా ఖలీద్‌ను దుర్బాషలాడుతూ పోలీస్‌స్టేషన్‌లోనే న్యూసెన్స్ చేసింది. దీనిపై మేహార్ ఫాతిమాపై సిటి పోలీస్ యాక్ట్‌లో కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఆమెకు 5రోజుల పాటు సాదారణ జైలు శిక్ష విధించారు. ఆమెను చెంచలగూడ మహిళా జైలుకు తరలించడం జరిగందని ఎవరైనా వ్యక్తులు ప్రభుత్వ ఆఫీసుల్లో న్యూసెన్స్ చేసిన చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని బోరబండ సిఐ కామల్ల రవికుమార్ తెలిపారు.

## డ్రైనేజీలు నిర్మాణానికి ఐదు కోట్లు రూపాయలు మంజూరు చేయండి

మైలార్‌దేవ్‌పల్లి, ఆగష్టు 18 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లలో డ్రైనేజీ పనుల నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయలు మంజారు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ వాటర్ వర్క్స్ ఎండి దాన కిశోర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై వాటర్ వర్క్స్ ఎండి దాన కిశోర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వెల్లడించారు.

## 21న దివ్యాంగుల చలో సెక్రటేరియట్

చిక్కడపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులు, బధిరుల సమస్యలను వెంటనే చర్యలు తీసుకోవాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లభనేని ప్రసాద్, వి.భారతి, ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో వారు మాట్లాడారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించడానికి రాష్ట్ర స్థాయిలో ఉన్న వివిధ సంఘాలతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని 12న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగిందని, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో దివ్యాంగులు ఈ సమావేశానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దివ్యాంగులకు సంబంధించిన సమస్యలను చర్చించి ప్రభుత్వం దృష్టికి ఆయా సమస్యలను తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఈ మహాధర్నా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

### 20నతెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు



ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్

చిక్కడపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు ద్వారా ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ వెల్లడించారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 20న ఇందిరాపార్కు వద్ద నిర్వహించతలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆందోళనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జెనిగె విష్ణువర్ధన్, పరిదల శ్రీనివాస్‌గౌడ్, జంగా సుదర్శన్, రాంబాబు ముదిరాజ్, నరేంద్రగౌడ్, సంపత్, లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరీదుల శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పి.సుందర్‌రెడ్డి, వీరస్వామి, నరేందర్‌రెడ్డి, విష్ణువర్దన్, మహేశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

## హత్యకేసును ఛేదించిన పోలీసులు

నాచారం, ఆగస్టు 18 ప్రభాతవార్త: ఈ నెల 15న నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ధారుణ హత్యకు గురైన నందలాల్ ప్రజాపతి హత్యకేసును పోలీసులు ఛేదించారు. మృతుడితో కలిసి ఉండే వ్యక్తే ఈ ధారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. మల్లాపూర్ రామక్రిష్ణ ఫంక్షన్ హాల్ సమీపంలో బీహార్‌కు చెందిన కూలి పనిచేసే నందలాల్ ప్రజాపతి(34) హత్యకు గురైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మృతుడితో కలిసి ఉండే రంజిత్ యాదవ్ (45)ను తరుచు మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసేవాడని మరో సారికూడా తనను డబ్బులు ఇవ్వాలని విసిగించడంతోనే తాను ఆగ్రహంతో కత్తితో ప్రజాపతిని హత్య చేసి పారిపోయినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. ఈ మేరకు పోలీసులు రంజిత్ యాదవ్‌ను రిమాండ్‌కు తరలించారు.

## అధికార పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం: టీపీసీసీ సభ్యుడు మర్రి ఆదిత్యారెడ్డి



బేగంపేట ఆగస్టు 18, ప్రభాతవార్త : సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎంతో బలంగా ఉందని, అధికార (బీఆర్ఎస్) పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని రానున్న ఎన్నికల్లో సనత్‌నగర్ లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగుర వేస్తామని టీపీసీసీ సభ్యుడు మర్రి ఆదిత్యారెడ్డి ధీమా వ్యక్తం చేసారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తన తాత మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి సనత్ నగర్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారని, అప్పట్లో ఎంతో అభివృద్ధి చేసారని అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీని అభిమానించే వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారు సనత్‌నగర్‌లో ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, పలు అసోసియేషన్లు కాంగ్రెస్‌పై ఎంతో నమ్మకంతో ఉన్నారని, వివిధ వ్యాపార రంగాల వారు సైతం కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలుకుతున్నారని ఆయన అన్నారు. నియోజకవర్గం లోని ప్రతి బస్తీని తాను సందర్శిస్తున్నానని, ప్రతి ఒక్కరి కష్టాలు తెల్సుకుని పాలు పంచుకుటానన్నారు. నియోజకవర్గంలోని ప్రతి బస్తీ, కాలనీలను సందర్శించి ప్రజలను కల్సుకుంటూ ముందుకు సాగనున్నట్లు ఆదిత్యారెడ్డి తెలియజేసారు.

## కాంగ్రెస్ అభ్యర్థిగా దరఖాస్తు



గోషామహల్ నియోజక వర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా దరఖాస్తు అందచేస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌గుప్త

గోషామహల్, ఆగస్టు 18ప్రభాతవార్త: అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల ఖరారు చేసేందుకు కాంగ్రెస్ శ్రీకారం చుట్టుంది. టిక్కెట్‌ను ఆశించబోయే కాంగ్రెస్ నాయకులు గాంధీభవన్‌లో దరఖాస్తులను అందచేస్తున్నారు. శుక్రవారం టిపిసిసి కార్యానిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌కు గోషామహల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధుసూధన్‌గుప్త దరఖాస్తు ఫారాన్ని అందచేశారు.

## ఓటర్ నమోదుపై అవగాహన

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 18ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికలో భాగంగా గోషామహల్ నియోజక వర్గం పరిధిలోని ఓటర్లకు ఓటర్ నమోదుపై మున్సిపల్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు శుక్ర వారం కోఠి ఫిరోజ్‌గాంధీ పార్క్‌లో వాకర్స్‌కు ఓటర్ నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

## అన్ని కులాలవారికి సిఎం కెసిఆర్ సమాన ప్రాధాన్యత : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించి గీత కార్మికులను సన్మానించిన మంత్రి

**సరూర్‌నగర్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన సిఎం కెసిఆర్ అన్ని కులాల వారికి సమాన గుర్తింపు నిచ్చి వారి సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ చందన చెరువు కట్టపై గౌడ సంఘాల వినతి మేరకు ఏర్పాటు చేయించిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీర్‌పేట్ మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గౌడ కులస్తుల సంక్షేమానికి పాటుపడుతూ నగరం నడిబొడ్డున నీరా కేఫ్‌లను ఏర్పాటు, గీత కార్మికులకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించారని తెలిపారు. భావితరాలవారికి గుర్తుండాలనే ఉద్దేశ్యంతో తాను జిల్లెలగూడ చెరువు కట్టపై సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు, ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలనే వినతి నేపథ్యంలో సిఎం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముడావత్ దుర్గదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమీషనర్ వాణి, డిఇఇ గోపినాథ్, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ పోరెడ్డి పద్మా భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్, ఉయ్యాల నవీన్‌గౌడ్, కో-ఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, బొబ్బిలి కిరణ్‌గౌడ్, రవిగౌడ్, దిండు భూపేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, బిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల ధర్నాకు మద్దతు : రాంరెడ్డి



కార్మికుల ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 18 ప్రభాతవార్త :** పారిశుధ్య కార్మికుల డిమాండ్లను పరిష్కరించి, ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని డిమాండ్ ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి చేసారు. ఎల్బీనగర్ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులతో కలిసి వారి ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించడమే కాకుండా వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామన్నారు. ఉద్యమంలో కాంట్రాక్టు ఉద్యోగాలు ఉండవన్న కెసిఆర్ అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు అవుతున్న పర్మినెంట్ చెయ్యలేదన్నారు. నాలుగు నెలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రాగానే కాంట్రాక్ కార్మికుల సమస్యలను పరిష్కరించి, కార్మికుల డిమాండ్లన్ని పరిష్కరిస్తామనిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి, మంజులరెడ్డి, రమేష్‌నాయక్, షరీఫ్, కృష్ణారెడ్డి, దీప్లానాయక్, రణధీర్‌రెడ్డి, శీను, సూర్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్‌లో బంగారు మైసమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

**సరూర్‌నగర్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** బాలాపూర్ గ్రామంలోని బంగారు మైసమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హాజరైన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఎర్ర మహేశ్వరి జైహింద్, బండారి మనోహర్, కో-ఆప్షన్ సభ్యుడు గుండోజు రఘునందనచారి, నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవసమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డిలు భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బంగారు మైసమ్మ ఆలయ నిర్వాహకులు ఎర్ర యాదయ్య, ఇబ్రహీం ముత్యాలు, తిమ్మని గిరీష్, ఎర్ర మైసయ్య, ఎర్ర జగన్, శంకరయ్య, లక్ష్మయ్య, నీరుడు శ్రీరాములు, బొగిరి బాబు, పెద్దింటి బల్వంత్‌లతో పాటు ఎర్ర బాబు, నాగేశ్, ఇబ్రాం ప్రేమ్, యాదయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.14లక్షలతో సిసి రోడ్డు పనులు : గీత



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 18 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ సాయిరాంనగర్ కాలనీలో రూ.14లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ సమగ్రాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని, ఇప్పటివరకు రూ.60కోట్ల వ్యయంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న సిసిరోడ్డు వేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ నిఖిల్‌రెడ్డి, ఎఇ రాజ్‌కుమార్, నాయకులు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, రామానుజం, శ్రీనివాస్‌యాదవ్, ప్రవీణ్, శ్యామ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి కృషి : భాగ్యలక్ష్మి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, ఆగస్టు 18 ప్రభాతవార్త:** మూసారాంబాగ్‌డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని శాలివాహననగర్ శాలివాహన టవర్స్ అపార్ట్‌మెంట్స్ సమీపంలో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో కమ్యూనిటీ హాళ్లు, పార్కులు, సిసిరోడ్లు, బిటిరోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులతో పలు అభివృద్ధిపనులను చేపట్టడడం జరిగిందన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, వర్క్ ఇన్స్పెక్టర్ సత్తిరెడ్డి, నాయకులు సంతోష్, మహేష్‌కుమార్, నరేందర్‌రెడ్డి, మల్లేష్, ఎస్ఎఫ్ఎ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం



సహకార సంఘం బ్రాంచిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, ఆగస్టు 18 ప్రభాతవార్త :** రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతు సేవా సహకార సంఘం నూతన బ్రాంచ్‌ను తొర్రూరులో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మంచిరెడ్డి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత ఆధారంగా రైతు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. రైతులకు అన్నిరకాల రుణాలు,ఇతర సహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు వంగేటి లక్ష్మారెడ్డి, సంఘ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవరెడ్డి, కొంద్రు స్వప్న శ్రీనివాస్, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణరెడ్డి, జక్క రాంరెడ్డి, నాయకులు కందాడ లక్ష్మారెడ్డి, బలదేవరెడ్డి, చెక్క సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

**హయత్‌నగర్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** సెకండ్ ఎఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం తీసుకువచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డిజిల్లా నాయకులు సామిడి శేఖర్‌రెడ్డి, పోలోజు లక్ష్మణాచారి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి రమావత్ సక్రు అధ్యక్షతన హయత్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహంవద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెకెండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో ప్రజా ప్రతినిధులను గ్రామాల్లో తిరుగనీయమన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సరిత, సుభద్ర, నాయకులు ఏ.శ్రీకాంత్, శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు ఉండాలి

**సరూర్‌నగర్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సిల్వర్ డ్రాప్స్ విద్యా సంస్థల ఛైర్మన్ జె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జిల్లెలగూడలోని సిల్వర్ డ్రాప్స్ హై స్కూల్‌లో శుక్రవారం విద్యార్థి నాయకుల ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ బాయ్‌గా అభిషేక్, హెడ్ గర్ల్‌గా శ్రావణి ఎన్నికయ్యారు. అదే విధంగా పలువురు విద్యార్థులను గ్రూపు లీడర్లుగా, వాలంటీర్లుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలతో సామాజిక సేవ, క్రమశిక్షణ, దృఢ సంకల్పం అలవడుతుందని అన్నారు. తమ విద్యా సంస్థల్లో విద్యార్థుల్లో నాయకత్వలక్షణాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్ ప్రశాంత్, ప్రిన్సిపాల్ మాధవి, ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న ఆల్ఫోర్స్ 'ఎన్ విజన్-2023'

**సైదాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఎన్ విజన్-2023 పేరుతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆల్ఫోర్స్ విద్యాసంస్థలఅధినేత డా.వి.నరేందర్‌రెడ్డి, చంపాపేట కార్పొరేటర్ వి.మధుసూధన్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన, ఆసక్తి ఉండాలన్నారు. మన రాష్ట్రం విభిన్న కళలకు నిలయమని, రాష్ట్రంలో ఉన్నన్ని కళలు,సాంప్రదాయాలు మరే రాష్ట్రంలో లేవన్నారు. అనంతరం ఉత్తమప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతు లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్‌లు, టీచర్‌లు పాల్గొన్నారు.

## అర్హులందరికి డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలి

**సైదాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** అర్హులందరికి డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బిజెపి అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు బిజెపి ఆధ్వర్యంలో సైదాబాద్ మెయిన్ రోడ్డుపై నిర్వహించిన రాస్తారోకోలో ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత, భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతూ మోసం చేస్తుందన్నారు. పేదలఇండ్ల నిర్మాణంకోసం కేంద్రం ఇస్తున్న నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం పక్కదోవ పటిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కుర్మగౌడ మాజీ కార్పొరేటర్ కూసూరు సహదేవ్ యాదవ్, జమాల్ పూర్ చంద్రశేఖర్, ధీరజ్‌లాల్, నిరంజన్ యాదవ్, వీరేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతను ప్రదర్శించి హక్కులను సాధించుకోవాలి

**నాచారం, ఆగస్టు 18 ప్రభాతవార్త:** సంచార కులాలు ఐక్యతను ప్రదర్శించి హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణ మోహన్ పేర్కొన్నారు. మల్లాపూర్‌లోని అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర వీరభద్రీయ సంఘం నూతన కార్యవర్గం పదవీ భాద్యతల స్వీకరణోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధులుగా హాజరై మాట్లాడారు. వీరభద్రీయులతో సహా సంచార కులాలు, జాతులు ఒకే సమిష్టి వేదికగా ఏర్పడి హక్కుల సాధనకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు డా.ఉపేందర్ కర్నే, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవవేందర్ రెడ్డి, వీరభద్రీయ సంఘం రాష్ట్ర జాతీయ నాయకులు చెవప్రాండు, కర్నె శివకుమార్, పన్నాల నాగరాజు, సాంబయ్య, మల్లూరి అనిల్‌కుమార్, రావూరి కృష్ణ, రాజయ్య, మిర్యాల స్వామి పాల్గొన్నారు.

## సర్వాయిపాపన్నగౌడ్‌కు నాయకుల నివాళులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 18 ప్రభాతవార్త :** సరూర్‌నగర్ డివిజన్ గౌడ సంక్షేమ సంఘంఆధ్వర్యంలో బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, మొగలాయి దౌర్జన్యాలను ఎదిరించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్త మనోహర్‌రెడ్డి,పందుల వెంకట్‌గౌడ్, నల్లెంకి ధనరాజ్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు దయానంద్‌గౌడ్, సెక్రెటరీ కందికంటి శ్రీధర్‌గౌడ్, అక్బర్, పవన్, భాస్కర్, అఫ్జల్ పాల్గొన్నారు.

## ఉచిత వివాహాలు నిర్వహించడం అభినందనీయం : ఎమ్మెల్సీ బొగ్గారపు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 18 ప్రభాతవార్త :** పేదలను గుర్తించి వారికి సాంప్రదాయబద్ధంగా వివాహం జరిపించడం అభినందనీయం అని ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తా పేర్కొన్నారు. మొగుళ్ళపల్లి యువసేన ఆధ్వర్యంలో 207వ ఉచిత వివాహం రమేశ్, గాయత్రికి సెల్వెల్ కార్పొరేషన్ ఎండి బండారు సుబ్బారావు సహకారంతో శుక్రవారం కొత్తపేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం ఆవరణలో వేద పండితులు కాలభైరవ స్వామీ నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## సెకండ్ ఎఎన్ఎంల రెగ్యులరైజ్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ధర్నా

**అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పిలుపు మేరకు జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, కార్యదర్శి ఆమనగంటి వెంకన్న నాయకత్వంలో సెకండ్ ఎఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం తీసుకువచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని అబ్దుల్లాపూర్ మండల కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కేతరాజు నరసింహ, వైస్ ప్రెసిడెంట్ దూపం నిరంజన్, దూల రాములు నారాయణరెడ్డి, బిక్షం నాయక్, లాలప్ప, మహేష్, శంకర్, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

## నిరు పేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించేవరకు పోరాటం : సామ



సామను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**మన్సూరాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేదలకు ఇచ్చిన హామీలను బిఆర్ఎస్ తుంగలో తొక్కిందని రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి దుయ్యబట్టారు. రాష్ట్ర బీజేపీ అధిష్ఠానం ఆదేశాల ప్రకారం శుక్రవారం ఎల్బీనగర్ జాతీయ రహదారిపై కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించాలని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ అసలైన పేదలకు న్యాయం జరగలేదని, కేవలం బిఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే జరిగిందన్నారు. లక్ష రూపాయల ఆర్థిక సాయం బి.సిలలోని అన్ని కులాలకు వర్తింప చేయాలని డిమాండ్ చేసారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించే వరకు పోరాడతామన్నారు. ఈ సందర్భంగా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అవ్వడంతో పోలీసులు అరెస్ట్ చేసి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్యామల, కృష్ణవేణి, సామ ప్రభాకర్ రెడ్డి,అంజన్‌కుమార్‌గౌడ్, అశోక్‌కుమార్, కవితరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు : బేతి



లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేతి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 18 ప్రభాతవార్త :** ఉప్పల్‌మండల పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన చెక్‌లను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పంపిణీ చేశారు. తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డి ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్దిదారులకు చెక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం కింద అర్హులైన పేదలకు చేయూత అందిస్తుందని తెలిపారు. మండల పరిధిలో సుమారు 227 మందికి చెక్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధ, కార్పొరేటర్ ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, నాయకులు అరటికాయల భాస్కర్, వి.సంతోష్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, కుమారస్వామి, జెసిబి రాజు తదితరులు పాల్గొన్నారు.

## వీరత్వానికి ప్రతీక సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్



పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పల్లె రవికుమార్, శ్రీధర్‌గౌడ్

**సైదాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ తెలంగాణా వీరత్వానికి ప్రతీకగా నిలుస్తారని రాష్ట్ర గీత కార్మిక సహకార సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ అన్నారు. పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకుని లింగోజిగూడ డివిజన్ సరూర్‌నగర్ గౌడ సంఘం భవనం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ సబ్బండ వర్గాలను ఏకం చేసిన మహనీయుడు పాపన్నగౌడ్ అని, ఆయన పోరాట స్ఫూర్తి అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. అన్యాయాన్ని ఎదిరిస్తూ పాపన్నగౌడ్ చూపిన పోరాట తెగువ అనన్యసామాన్యమైనదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జి.దయానంద్ స్వామి, కందికంటి శ్రీధర్‌గౌడ్, ఆర్.బాలరాజు, డి.ఆనంద్, జె.కొండల్, ప్రవీణ్, శ్రీనివాస్, శ్రీకాంత్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను ఉచితంగా అనుమతించాలి



జడ్సీతో చర్చిస్తున్న గంగారామ్, నాగభూషణం తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 18 ప్రభాతవార్త:** మలక్‌పేట జాతీయ ఉద్యానవనంలోకి దివ్యాంగులను ఉచితంగా అనుమతించాలని ఎఫ్ఇడి అధ్యక్షుడు గంగారామ్, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం పేర్కొన్నారు. మలక్‌పేట డిసి కార్యాలయంలో సౌత్‌జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న, డిసి జయంత్, జెసియుసిడి వెంకట్‌రెడ్డి, డిపిఓ యుగంధర్‌రెడ్డి తదితరులతో కలిసి వారు సమావేశాన్ని నిర్వహించి పలు అంశాలగురించి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులను అనుమతించడంతోపాటు వారు నిర్వహించే అన్ని రకాల సమావేశాలను ఉద్యానవనంలో అందుబాటులో ఉంచాలని కోరారు. ఉద్యానవనంలో అందించే సేవలను మరింత విస్తృతపర్చాలన్నారు. దీంతో వెంటనే అధికారులు స్పందించి చర్యలు చేపడతామని హామీనిచ్చారు.

## షేర్ ద విజన్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం




నిత్యావసర వస్తువులను అందిస్తున్న కమిషనర్, కౌన్సిలర్ తదితరులు

**హయత్‌నగర్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయమని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కమిషనర్ రవీందర్‌రెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతి విజేందర్‌రెడ్డి అన్నారు. షేర్ ద విజన్ (ఖమ్మం)స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన నిత్యావసర వస్తువులను వారు శాంతినగర్‌కాలనీలో కుష్టువ్యాధి సోకిన 100 మంది కుటుంబాలకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు స్వలాభం కోసం కాకుండా పేదల కోసం సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమానికి సహకరించిన సొసైటీ ఆఫ్ లెప్రసీ ఎఫెక్ట్ పర్సన్స్ సంస్థ ప్రతినిధులకు షేర్‌దవిజన్ సంస్థ అధ్యక్షుడు నారాయణ, ట్రెజరర్ సద్గుణరావు, సుధీర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే మైనంపల్లి తదితరులు

**మల్కాజిగిరి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** మౌలాలి డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్, ఆర్టీసి కాలనీ, క్రిష్ణనగర్, గోకుల్‌నగర్ కాలనీలలో సుమారు 3 కోట్ల 47లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులు, రాక్ కాలనీలో యుజిడి, షఫీనగర్, సదుల్లానగర్, నెహ్రూనగర్, మారుతినగర్ ఏరియాలలో ఆర్‌సిసి పైప్ లైన్ పనులు, గాంధీనగర్‌లో గ్రేవియర్డ్ పనులతో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, డిఈ మహేష్, ఎఈ మధురిమా, జిఎన్‌వి సతీష్ కుమార్,పిట్ల శ్రీనివాస్, ఆమినుద్దీన్, భాగ్యనంద్‌రావు, కాలనీవాసులు పాల్గొన్నారు. అదే విధంగా ఈస్ట్ ఆనంద్‌భాగ్ డివిజన్ జవహర్‌నగర్‌లో రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్యా, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్, బద్దం పరశురాం రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, గీతాగుప్త, కవిత, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అక్రమ అరెస్టులు దారుణం : రంగారెడ్డి

**తుర్కయంజాల్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** పోలీసులు, అధికారుల తీరు బిఆర్ఎస్ కార్యకర్తలగా వ్యవహరిస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని జెబిఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటీ వద్ద అధికారులు ఏర్పాటు చేసిన శిలాఫలకంపై ప్రోటోకాల్ పాటించకపోవడంతోపాటు స్థానిక కాంగ్రెస్ కౌన్సిలర్ కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్ తన పేరు లేదని ఆసహనం వ్యక్తం చేస్తూ ఇది ప్రభుత్వ కార్యక్రమమా, బిఆర్ఎస్ కార్యక్రమమా అని ప్రశ్నించడంతో మంగమ్మను అరెస్టు చేసారని ఆమెను పరామర్శించడానికి వెళ్లిన కౌన్సిలర్లందరనీ నిర్బంధించడంతో పోలీసులు తీరుపై తాము మానవ హక్కుల కమీషన్, కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. మంగమ్మకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు బింగి దాసుగౌడ్, మహిపాల్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు కాకుమాను సునీల్, మున్సిపల్ చైర్మన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత ధన్ రాజ్ గౌడ్, ఫ్లోర్ లీడర్ కోషికె ఐలయ్య, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు ఎల్లవేళలా అండగా ఉంటాం



లా అండ్ ఆర్డర్ కార్యాలయం ప్రారంభించి బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ డిసిపి వెంకటరమణ, కుషాయిగూడ ఏసిపి వై.వెంకట్‌రెడ్డి

**కుషాయిగూడ, ఆగస్టు 18 ప్రభాతవార్త :** బాధితులకు పోలీసులు ఎల్లవేళలా అండగా ఉంటారని రాచకొండ పోలీస్ కమిషనరేట్ మల్కాజ్‌గిరి లా అండ్ ఆర్డర్‌అడిషనల్ డిసిపి ఎన్.వెంకటరమణ పేర్కొన్నారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మల్కాజ్‌గిరి లా అండ్ ఆర్డర్ నూతన కార్యాలయాన్ని పూజలు నిర్వహించి ప్రారంభించి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో భరోసాతో నమ్మకంతో వచ్చే బాధ్యత ప్రజలకు తాము స్నేహపూర్వకంగా అండగా నిలిచి న్యాయం చేకూరుస్తామన్నారు. ప్రతిపోలీసు ప్రజల పట్ల స్నేహపూర్వకంగా భరోసా కల్పించే విధంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఏసిపి వై.వెంకట్‌రెడ్డి, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌యాదవ్, లయన్స్ క్లబ్ సభ్యులు జ్యోతిర్మయాచారి వడ్లోజు, మండా సురేష్, మేకల నవీన్ నాయుడు, మిట్టపల్లి విజయ్‌గౌడ్, బోదాసు రవి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయింపు



సర్కిల్ కార్యాలయం ముందు బైఠాయించిన కార్పొరేటర్లు, కార్మికులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 18 ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికులను పర్మనెంట్ చేయాలని సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న శానిటేషన్ సిబ్బందికి బిజెపి కార్పొరేటర్లు మద్దతు తెలుపుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ ప్రాణాలనులెక్కచేయకుండా వీధులు, రోడ్లను శుభ్రం చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడానికి అధికార పార్టీ ఎందుకు ముందుకు రావడంలేదని ప్రశ్నించారు. గ్రేటర్‌కు స్వచ్ఛత అవార్డులు వస్తున్నాయని చెప్పుకుంటున్న మంత్రి కేటీఆర్ పారిశుద్ధ కార్మికుల గొప్పతనం గుర్తించకపోవడం సిగ్గుచేటన్నారు. రానున్న జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశంలో శానిటేషన్ కార్మికులను పర్మనెంట్ చేయాలనే అంశంపై బిజెపి కార్పొరేటర్లు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధా ధీరజ్ రెడ్డి,ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్, రంగ నరసింహగుప్తా, కొప్పుల నర్సింహా రెడ్డి, జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధానకార్యదర్శి పిట్ట ఉపేందర్‌రెడ్డి, బాణాల ప్రవీణ్‌కుమార్, సిద్దు ముదిరాజ్, ఎస్ఎఫ్ఏలు, కార్మికులు పాల్గొన్నారు.

## పోలీసులను ఉద్యోగం నుండి తొలగించాలి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 18 ప్రభాతవార్త :** గిరిజన మహిళపై విచక్షణ రహితంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించి దాడి చేసిన పోలీసులను ఉద్యోగం నుండి తొలగించాలని తెలంగాణా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ ధర్మా నాయక్ డిమాండ్ చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని తెలంగాణా గిరిజన సంఘం రంగారెడ్డిజిల్లా కార్యాలయంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ దర్మానాయక్, జిల్లా కార్యదర్శి రామావత్ పాండునాయక్, ఉపాధ్యక్షులు యం.గోపినాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం రోజు ఎల్‌బినగర్ చౌరస్తాలో బస్సు కోసం నిలబడ్డ గిరిజన మహిళా వద్యా లక్ష్మీనీ ఎల్‌బినగర్ పోలీసులు ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి డబ్బులు, సొమ్మును లాక్కొని ఆమె పై థర్డ్ డిగ్రీ ప్రయోగించి కొట్టడం అమానుషమన్నారు. బాధ్యులైన ఇద్దరు పోలీసులను ఉద్యోగం నుండి తొలగించాలని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలనీ డిమాండ్ చేశారు.బాధితురాలికి నష్టపరిహారంగా రూ.50 లక్షలు, డబల్‌బేడ్‌రూమ్ ఇల్లు ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతాం: అరుణ

**సైదాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ కళ్యాణ్‌నగర్‌లోని పార్కులో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని పార్కులన్నింటిని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గోవింద్‌రాజు, రామకృష్ణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.